ప్రజాశక్తి

గురువారం 28 మార్చి 2024 5 శ్రీ సత్యసాయి





అసంతృప్తులను

దారికి తెచ్చేరా..?

◆ నేడు ఉమ్మడి జిల్లాలో చంద్రబాబు పర్యటన

◆ ఏర్పాట్లను పూర్తి చేసిన టిడిపి నాయకులు




ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలు సమీస్తున్న తరుణంలో తెలుగుదేశం పార్టీకి సంబంధించి టిక్కెట్లు ఖరారైన చోట కొన్నింటిలో అసంతృప్తులు నెలకొన్నాయి. అభ్యర్థులు కలుపుకుపోయే ప్రయత్నాలు చేసినా పెద్దగా సర్దుబాటు అవుతున్న పరిస్థితుల్లేవు. కొన్ని చోట్ల అయినట్టు ఉన్నా లోలోన మాత్రం ఎన్నికల్లో తమ సత్తా చాటుదామన్న ఆలోచనలో ఉన్నట్టు చర్చ నడుస్తోంది. ఒకవైపు అధికార వైసిపి ఇప్పటికే ఎన్నికల్లో గెలుపునకు అవసరమైన అన్ని రకాల వ్యూహాలను అమలు చేస్తోంది. టిడిపి మాత్రం ఇప్పటికీ గ్రూపు తగాదాలతో సతమతమతం అవుతూనే ఉంది. ఈ నేపథ్యంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. రాత్రికి ఇక్కడే బస చేయనున్నారు. ఈ సమయంలో అసంతృప్తులపైనా దృష్టి సారించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఆయన పర్యటించే శింగనమల, కళ్యాణదుర్గం, మడకశిర నియోజకవర్గాల్లో నేతల మధ్య సఖ్యతలేదు. ధర్మవరం టిక్కెట్టు టిడిపికే ఇవ్వాలని పరిటాల శ్రీరామ్ వర్గీయులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఆందోళనలు సైతం చేపడుతున్నారు. టిక్కెట్లు ఖరారు కాని అనంతపురం అర్బన్, గుంతకల్లు, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థులపై సందిగ్ధతత కొనసాగుతోంది. టిక్కెట్టు కోసం నేతలు ఎవరికి వారుగా పోటీలు పడుతూనే ఉన్నారు. ఒకరికిస్తే మరొకరు సహకరించే పరిస్థితులు కనిపించడం లేదు. గుంతకల్లు టిక్కెట్టు మాజీ మంత్రి జయరాంకు ఇవ్వడానికి వీల్లేదని స్థానిక నేతలు అక్కడ నిరసనలు చేపడుతున్నారు. వీటన్నింటినీ ఈ పర్యటనలో ఏ రకంగా కొలిక్కి తీసుకొస్తారన్నది పార్టీ శ్రేణులు ఎదురు చూస్తున్నాయి.


బాబు పర్యటన ఇలా...

చంద్రబాబు నాయుడు గురువారం ఉదయం 10.45 గంటలకు మదనపల్లి నుంచి హెలిక్యాప్టర్‌లో ప్రసన్నాయపల్లి వద్ద దిగుతారు. అక్కడి నుంచి నేరుగా రాప్తాడు బస్టాండ్ సర్కిల్‌కు చేరుకుంటారు అక్కడ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం ఆర్డీటీ అతిథి గృహంలో బస చేస్తారు. మధ్యాహ్నం 2.20 గంటలకు బస చేసిన ప్రాంతం నుంచి బయలుదేరి బుక్కరాయసముద్రం చేరుకుంటారు. అక్కడ అంబేద్కర్ సర్కిల్‌లో బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 4.15 గంటలకు ప్రసన్నాయపల్లి నుంచి హెలిక్యాప్టర్‌లో బయలుదేరి 5.10 గంటలకు కదిరికి చేరుకుంటారు. మహాత్మాజ్యోతిబా పూలే సర్కిల్‌లో సాయంత్రం 7.30 గంటలకు బహిరంగ సభ ముగుస్తుంది. అక్కడే రాత్రికి బస చేస్తారు.



కమలంలో కాక..!

◆ ధర్మవరం సూరికి కాదని సత్యకుమార్‌కు అవకాశం ◆ హిందూపురం పార్లమెంట్ తీసుకోలేదని పరిపూర్ణానంద గుర్రు



గోనుగుంట్ల సూర్యనారాయణ



సత్యకుమార్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి, జనసేనతో కలసి సీట్లు సర్దుబాటు చేసుకున్న బిజెపిలో టిక్కెట్ల కాక పుట్టిస్తున్నాయి. గత ఎన్నికల్లో పోటీచేసి ఒక్క శాతం ఓట్లు కూడా దక్కని ఆ పార్టీకి ఈసారి పొత్తులో నెగ్గుకురావాలని చూస్తోంది. అయితే సీట్ల సర్దుబాట్లతోపాటు, టిక్కెట్ల కేటాయింపులు కాకపుట్టిస్తున్నాయి. ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గ టిక్కెట్టు పొత్తుల్లో భాగంగా బిజెపి తీసుకుంది. ఈ నియోజకవర్గంలో ముందు నుంచి సొంతగా పట్టు కలిగిన మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్య నారాయణకు ఇస్తారని భావించారు. చివరి వరకు అదే పేరు వినిపించింది. అంతేకాకుండా అధిష్టానం నుంచి సంకేతాలున్నాయంటూ ఆయన ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న శ్రీరామ్ వర్గీయులు ఆయనకు ఇవ్వడానికి వీల్లేదని నిరసనలు చేపట్టారు. ఇతరులెవరికిచ్చినా సహకరిస్తామని ప్రకటించారు. అయినా స్వతహాగా ఈ నియోజకవర్గంలో బిజెపికి అంతటి బలం లేదు. ఒక్క శాతం ఓటు బ్యాంకు కూడా లేదన్నది పూర్వపు ఎన్నికల్లో స్పష్టమైంది. ఈ నేపథ్యంలో జి.సూర్యనారాయణకే బిజెపి టిక్కెట్టు వస్తుందని భావించారు. చివరి నిమిషంలో బిజెపి అభ్యర్థుల్లో మార్పులు చేపట్టింది. హిందూపురం పార్లమెంట్‌కు పోటీ చేయాలనుకుంటున్న సత్యకుమార్‌ను తీసుకొచ్చి ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించింది. ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గంలో సత్యకుమార్‌కు ఏ మాత్రం పట్టులేదు. కనీసం ఈ ప్రాంతంలో ఎటువంటి సంబంధాలూ లేవు. ఒకరకంగా చెప్పాలంటే ఈయనెవరో కూడా ఇక్కడి ప్రజలకు తెలియదు. అటువంటి వ్యక్తిని ఇక్కడ పోటీలో పెట్టడం అందరనీ విస్మయానికి గురిచేస్తోంది. ఇంకో వైపు సత్యకుమార్ కూడా అసెంబ్లీ కంటే పార్లమెంటు వైపే ఎక్కువ మొగ్గు చూపినప్పటికీ బిజెపి ఇక్కడి నుంచి బరిలో దింపాలని నిర్ణయించింది.

కూటమిలో భాగంగా హిందూపురం పార్లమెంటు టిక్కెట్‌ను ఆశించిన వారిలో పరిపూర్ణానంద స్వామి ఉన్నారు. ఈ స్థానం బిజెపికి కేటాయిస్తున్నట్టు ముందుగా ప్రకటనలూ వచ్చాయి. అయితే ఆఖరు నిమిషంలో ఈ నియోజకవర్గం పొత్తుల్లో టిడిపికే ఉండిపోయింది. దీనిపై పరిపూర్ణానందస్వామి అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. బిజెపి టిక్కెట్టు ఇవ్వకున్నా స్వతంత్రంగా పోటీ చేస్తామనని ప్రకటించారు. ఇలా బిజెపిలో టిక్కెట్ల గోల నడుస్తోంది. సత్యకుమార్ ధర్మవరం నుంచి పోటీ చేస్తే మాజీ ఎమ్మెల్యే జి.సూర్యనారాయణ ఏ మేరకు సహకరిస్తారన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఆయనకే టిక్కెట్టు ఉంటుందని భావించి ప్రచారం కూడా ప్రారంభించుకున్నాక మార్పు జరగడంతో ఆయన తీవ్రమైన అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. స్వతంత్రగా పోటీ చేస్తే ఎలాగుంటుందన్న ఆలోచనలోనూ ఉన్నట్టు సమాచారం. అదే జరిగితే బిజెపి పరిస్థితి మరింత దయనీయంగా మారే అవకాశముంది.



ఈవీఎంలు భద్రపరిచిన కేంద్రం వద్ద అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఎన్నికలు సజావుగా నిర్వహిద్దాం

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వచ్చే సార్వత్రిక ఎన్నికలను ఎన్నికల నియమ నిబంధనలు ప్రకారం సజావుగా నిర్వహించేందుకు అధికారులందరూ కృషి చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు సూచించారు. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారుల సమక్షంలో గోడౌను తెరిపించారు. ఈవీఎం, బ్యాలెట్ పేపర్, కంట్రోల్ యూనిట్, ఈవి ప్యాట్‌లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద భద్రత పటిష్టంగా ఉండేలా అధికారులు అనునిత్యం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఓటు నమోదుకు ఏప్రిల్ 15వ తేదీ వరకు సమయం ఉందన్నారు. అందరికీ ఓటు హక్కును కల్పించే విధంగా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. నియోజకవర్గంలో పోలింగ్ బూత్ కేంద్రాలు ఓటర్లకు అనుకూలంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను వారు ఆదేశించారు. వద్ధులు, వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, తహశీల్దార్ రమేష్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీ నుండి వైసిపిలోకి చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణంలోని 15వ వార్డులో కౌన్సిలర్ కుండా చౌడయ్య, వార్డు ఇన్‌ఛార్జి కుండా మీనాక్షయ్యల ఆధ్వర్యంలో 90కుటుంబాలు 27వ వార్డులో ఇన్‌ఛార్జి కామిరెడ్డిపల్లి సుధాకర్రెడ్డి ఆధ్వర్యంలో 215 కుటుంబాల వారు ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో టీడీపీనుండి వైసిపిలోకి చేరాయి. వారందరికి ఎమ్మెల్యే కేతిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వైసిపి పాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణాధ్యక్షులు నీలూరి ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు కరీం, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, పెణుజూరు నాగరాజు, మాసపల్లి సాయికుమార్, చింతా యల్లయ్య, వార్డు ఇన్చార్జులు, నాయకులు తొండమాలరవి, ఎస్ హెచ్ బాష, సాధిక్, పెద్దిరెడ్డిగారి శ్రీనివాసులు. అమీర్ బాషా చెలిమిపెద్దన్న, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉషశ్రీచరణ్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - రొద్దం

సిఎంగా జగనన్నను మళ్లీ గెలిపించుకుందామని మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. మండలంలోని నారనాగేపల్లి గ్రామంలో మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైసిపి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, నాయకులు కలిపి శ్రీనివాసులు, తిమ్మయ్య, నరేందర్ రెడ్డి, సి.నారాయణరెడ్డి, ఎన్ నారాయణరెడ్డి, అక్కులప్ప, వినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

'పది' విద్యార్థులకు ఉపయోగకరంగా యుటిఎఫ్ మెటీరియల్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పదవ తరగతి విద్యార్థుల కోసం యుటిఎఫ్ రూపొందించిన మెటీరియల్ ఎంతో ఉపయోగంగా మారిందనియుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సెట్టిపి జయ చంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అన్ని సబ్జెక్టులలో 65 నుండి 79 శాతము స్కోరు చేసే విధంగా యుటిఎఫ్ మెటీరియల్ నుండి ప్రశ్నలు వచ్చాయన్నారు. చివరిగా బుధవారం జరిగిన సోషల్ పరీక్షల్లో 84 మార్కులకు ప్రశ్నలు వచ్చి విద్యార్థులందరినీ కూడా సంతోషపరిచాయని తెలిపారు. సోషల్ ప్రశ్న పత్రంలో ప్రత్యక్షంగా పరోక్షంగా మెటీరియల్ నుండి ఛాయిస్‌తోకలుపుకుంటే 94 కు పైగా మార్కులు రావడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. సోషియల్ ప్రశ్న పత్రం తయారు చేసిన కెఎస్‌వి. కృష్ణారెడ్డికి ఈసందర్భంగా వారు అభినందనలు తెలిపారు, విద్యార్థుల కోసం అతి తక్కువ ఖర్చుతో ఎంతో ఉపయోగకరమైన మోడల్ పేపర్లను అందించిన యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ హనుమంతరావుకు, కన్వీనర్ కెఎస్ఎస్. ప్రసాదుకు, ప్రచురణల కమిటీ సభ్యులు రాజశేఖర్, గోపాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాల తనిఖీ

గోరంట్ల రూరల్ : స్థానిక సిఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని బూదిలి పంచాయతీ గొల్లపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ధర్నాలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - నల్లమాడ

నల్లమాడ పంచాయతీలోని వివిధ కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు గోవింద్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆయా కాలనీల వాసులు బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని నాగల కట్ట వీధిలో దాదాపుగా రెండు నెలలుగా తాగునీటి సమస్య నెలకొందన్నారు. అక్కమ్మ కాలనీ లో కూడా నీటి సమస్య అధికంగా ఉందన్నారు. సమస్యను పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఓకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీలవాసులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ధర్మవరం క్రీడాకారులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ ప్రాపబుల్స్ జట్లకు ధర్మవరం బాల బాలికలు ఎంపికైనట్లు ధర్మాంభ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయ చంద్ర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఏప్రిల్ 9వ తేదీ నుండి 15వ తేదీ వరకు పాండిచ్చేరి రాష్ట్రంలో జరిగే 38వ యూత్ నేషనల్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాల బాలికల జట్ల ఎంపికకు మార్చి 28 నుండి ఏప్రిల్ ఏడవ తేదీ వరకు చిత్తూరులో కోచింగ్‌క్యాంప్ జరుగుతుందన్నారు. కోచింగ్ క్యాంపునకు ధర్మవరం పట్టణానికి చెందిన బాలికల విభాగంలో సల్మా, కిరణ్మయి, బాలుర విభాగంలో విజయ్ ఎంపిక అయ్యారని అన్నారు. ఎంపికైన బాలబాలికలను అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, వాయల్పాడు హిదాయత్తుల్ల ,కోచ్ సంజయ్, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.



జాతీయ స్థాయిపోటీలకు ఎంపికైన వారితో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నాయకులు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న అభ్యర్థి సవితమ్మ

గ్రామాల్లో సవితమ్మ ప్రచారం

పరిగి : మండలంలోని నరసాపురం,సిరికోలం, హెూన్నంపల్లి, పరిగి పంచాయతీలలో టిడిపి పెనుగొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి నాయకులు ప్రజలకు వివరించారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కొన్ని గ్రామాలలో టిడిపిలో వర్గ పోరు ఉన్నప్పటికీ సీనియర్ టిడిపి నాయకులతో చర్చించి సమస్యను పరిష్కరించి ప్రచారం నిర్వహించడం టిడిపి నాయకుల్లో మరింత ఉత్సాహాన్ని నింపినట్లైందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ, మాజీ సర్పంచి శ్రీనివాసరెడ్డి, నర్సాపురం గోవింద్ రెడ్డి, చంద్రశేఖర్, మాజీ సర్పంచి మైలారప్ప, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, చౌడప్ప, హనుమయ్య, వడ్డెర శ్రీనివాసులు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని పాత్రికేయులు కలెక్టర్ అరుణ్ బాబును కోరారు. ఈ మేరకు వారు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ, చాలా ఏళ్లుగా ప్రెస్ క్లబ్ లేక పాత్రికేయులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. 10 సెంట్ల స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌కు విన్నవించారు. గతం లో కూడా పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోయిందన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రెస్ కబ్ కు స్థలం కేటాయిస్తే భవన నిర్మాణానికి తాము కృషి చేస్తామన్నారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ స్థలం కేటాయిస్తామని పాత్రికేయులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు పుల్లయ్య, అయ్యన్న గారి శ్రీనివాసులు, మురళి, కుళ్లాయప్ప, నరసింహులు, విజయ్ కుమార్, మహేష్, కేశవ, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేద్దాం

పరిగి : వచ్చే ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేసి టిడిపి విజయానికి కృషి చేద్దామని హిందూపురం పార్లమెంట్ టిడిపి అభ్యర్థి పార్థసారధి అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం పరిగి మండల కేంద్రంలోని బీర లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గంలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి కనీస అవసరాలు తీర్చడానికి తన వంతుగా కృషి చేస్తానని నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని అగళి మండలం పి. బ్యాడిగిరలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి మాట్లాడుతూ చంద్రబాబు రూపొందించిన సూపర్ సిక్స్ పథకాల వల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న , రాష్ట్ర ఒక్కలిగ కన్వీనర్ పాండురంగప్ప, మాజీ ఎంపీపీ రామకృష్ణ, మాజీ జెడ్పిటిసి రామకృష్ణ యాదవ్, జనసేన నియోజకవర్గ కన్వీనర్ రంగస్వామి, కుమారస్వామి, మాజీ జెడ్పిటిసి నరసింహా మూర్తి, జిల్లా కార్యదర్శి రవి భూషణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో నాయకులు

'బికె'ను కలిసిన గుండుమల

మడకశిర: తెలుగుదేశం పార్టీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బికె పార్థసారధిని మడకశిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, ఇతర నాయకులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పెనుకొండలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్థసారధిని కలిసిన నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి , క్లస్టర్ ఇన్‌ఛార్జి కల్లుమరి సర్పంచి నాగరాజు, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు నాగభూషణ, మూర్తి, వీరక్యాతప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

కదిరి టౌన్ : తనకల్లు మండలానికి చెందిన వైసిపి, జనసేన నాయకులు కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం పట్టణంలోని కందికుంట నివాసంలో జరిగిన కార్యక్రమంలో పలువురు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. తిరుమల్లయ్య గారి పల్లి మండెం వెంకట్ రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షులు, మాజీ సర్పంచి వి.వెంకట రమణప్ప, పి.రామచంద్ర, మని,జనసేన నాయకులు గజేంద్ర నాయక్, అజిత్ నాయక్, ధనలక్ష్మి తదితరులకు పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కదిరి నియోజకవర్గ పరిశీలకులు వాహీద్, పివి.పవన్ కుమార్ రెడ్డి, తనకల్లు మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ సింగల్ విండో సభ్యులు చలపతి తదితరులు పాల్గొన్నారు




పార్టీలోకి చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్

మోహినీ అవతారంలో శ్రీవారు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు బుధవారం మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అవతారంలోని శ్రీవారి కుచ్చుల వాలుజడ ఈ ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణ. పట్టు చీరలో అందరినీ అకట్టుకొనే విధంగా స్వామి వారిని కదిరి మల్లెలతో అలంకరించారు. తిరు వీధుల దర్శనానంతరం శ్రీవారు రాత్రంతా పట్టణంలో ఊరేగుతారు. గురువారం ప్రజాగరుడోత్సవంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



మోహిని అవతారంలో దర్శనమిస్తున్న శ్రీవారు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వన్‌టౌన్ సిఐ

చలివేంద్రం ప్రారంభం

ధర్మవరం టౌన్ : ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాల ఏర్పాటు చేయడం అభినందనీయమని వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా సబ్ జైలు సమీపంలో పుట్టపర్తి రోడ్డు నందు ఇఎస్‌విఆర్ సేవా ట్రస్ట్ వారి సహకారంతో, అంజన శక్తి పశుపుల ధానావారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిఐ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇఎస్‌విఆర్ సేవా ట్రస్ట్ కార్యదర్శి ప్రతాపరెడ్డి, శ్రేయోభిలాషులు, స్నేహితులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

కొత్తచెరువు : శ్రీ సత్యసాయి జిల్లావ్యాప్తంగా జరిగిన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయని డీఈవో మీనాక్షి తెలిపారు బుధవారం జిల్లా వ్యాప్తంగా సాంఘిక శాస్త్రం పరీక్షకు 115 కేంద్రాల్లో 22,658 మందికి గాను 21,822 మంది హాజరయ్యారని అన్నారు.

లేపాక్షి : మండల కేంద్రంలోని పదవతరగతి పరీక్ష కేంద్రాన్ని రీజనల్ డైరెక్టర్ రాఘవరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. శనివారం జరిగిన ఫిజిక్స్ ఎగ్జామ్స్ పూర్తి అయిన తర్వాత బిఎఫ్‌పి ప్యానెల్ వగలగొట్టిన విద్యార్థుల తల్లి తండ్రులచే రూ. 1.30వేలను జిల్లా విద్యాశాఖ అధికారిని మీనాక్షి, ఎంఇఒ, నాగరాజు, హెడ్ మాస్టర్ గిరి సమక్షంలో రికవరి చేశారు.

గాండ్లపెంట : మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఈ సందర్భంగా పరీక్షల విభాగం అధికారులు శ్రీధర్ రెడ్డి, బషీర్, గౌస్ నాయుడు మాట్లాడుతూ 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు నిర్వహించామన్నారు. మండలంలోని రెండు పరీక్ష కేంద్రాలలో జిల్లా పరిషత్ పాఠశాలలో 282 మంది, కెజిబివిలో 108 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు.

గురుకుల పాఠశాలకు దొడగట్ట విద్యార్థుల ఎంపిక

రొద్దం : అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలకు ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. మండలంలోని దొడగట్ట దొడగట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు ఈ నెల 10న హిందూపురంలో రాశారు ఈ పరీక్షల్లో దొడగట్టకు చెందిన 4 వ తరగతి చదువుతున్న డి.మధుశ్రీ, ఎచ్. హేమశ్రీ హిందూపూర్ అంబేద్కర్ గురుకులానికి ఎంపిక కాగా ఏ.హేమశ్రీ అమరాపురం గురుకులానికి ఎంపికయ్యారు. విద్యార్థులు ప్రవేశ పరీక్షలో సీట్లు పొందినందుకు తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు హరీష్, తేజ హర్షం వ్యక్తం చేశారు.

31న ఉచిత కంటివైద్యశిబిరం

ధర్మవరం టౌన్ : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 31న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గూడూరు మోహన్ దాస్, రాజగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వైద్యశిబిరానికి ముఖ్యఅతిథిగా వన్ టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, సభా నిర్వహణను లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు వెంకటస్వామి హాజరవుతున్నట్లు వారు తెలిపారు. క్యాంపు దాతగా నారాయణరెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. ముఖ్య వక్తగా క్లబ్బు చార్టర్ నెంబర్ పల్లెం వేణుగోపాల్ తో పాటు క్లబ్ సభ్యులు కూడా పాల్గొంటారని తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గ్రామీణ పట్టణ, ప్రాంత పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా జక్కల లక్ష్మీనరసింహ గౌడ్

గాండ్లపెంట : వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా మండలానికి చెందిన జక్కల లక్ష్మీనరసింహ గౌడ్ ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని వైసీపీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జక్కల లక్ష్మీ నరసింహ గౌడ్‌తో పాటు జిల్లా మైనార్టీ కార్యదర్శి ఎస్‌జె బావుద్దీన్ మాట్లాడారు. పార్టీకి చేసిన సేవలు గుర్తించి తమను నమ్మకంతో ఎంపిక చేసిన అధిష్టానానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

ప్రజాశక్తి బుక్కపట్నం

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే ప్రజల సహకారం అవసరమని రూరల్ సిఐ రాగిరి రామయ్య, కొత్తచెరువు సిఐ రాజా రమేష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో బిఎస్ఎఫ్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐలు మాట్లాడుతూ ప్రశాంత వాతారణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్‌పై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్ బాబు, ఎఎస్ఐ మస్తాన్, రమణ, బిఎస్ఎఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు

మడకశిర : పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా జి గోవిందరాజు, ఉపాధ్యక్షులు గా ఆర్ నాగేంద్ర, ప్రధాన కార్యదర్శిగా త్రిలోక్, ఉప కార్యదర్శిగా జయరాం, కోశాధికారిగా హనుమంతరాయుడు, లైబ్రేరియన్‌గా నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు కదిరికి చంద్రబాబు రాక



చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు గురువారం నాడు కదిరికి రానున్నారు. ప్రజాగళం యాత్రలో భాగంగా కదిరిలో పర్యటించనున్నారు. సాయంత్రం 6-30 గంటలకు పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొననున్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముస్లిములతో చంద్రబాబు నాయుడు మాట్లాడనున్నారు. చంద్రబాబు నాయుడు పర్యటన సంబంధించి ఏర్పాట్లను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పూర్తి చేశారు.

డిగ్రీకళాశాల ప్రాంగణంలో ఇఫ్తార్ విందు

చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు : కందికుంట

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను చేశామని కదిరి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ తెలియజేశారు. బుధవారం కదిరిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముస్లిముల ఆచారాలు, సాంప్రదాయాలను టిడిపి ఎప్పుడూ గౌరవిస్తుందని తెలియజేశారు. పవిత్ర రంజాన్ మాసంలో చంద్రబాబు నాయుడు మొట్టమొదటిసారిగా కదిరికి విచ్చేస్తున్నారని తెలిపారు. రంజాన్ మాసం పురస్కరించుకుని ముస్లిం సోదరులకు పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో సాయంత్రం 6.30 గంటలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఇఫ్తార్ విందులో చంద్రబాబు నాయుడు పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని ముస్లిం మత పెద్దలు, నాయకులు, ముస్లిములు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహిళ మృతి కేసులో ముగ్గురు అరెస్టు

భర్త కొట్టడం వల్లే అంజలి మృతి : డీఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలోని కలెక్టరేట్ ఎదుట అంజలి(29) అనే మహిళ ఆకలితో చనిపోయిందని రెండు రోజుల క్రితం పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీనిపై ఆలస్యంగా స్పందించిన పోలీసు యంత్రాంగం ఘటనపై సమగ్ర విచారణ జరిపి వివరాలను సేకరించారు. మంగళవారం రాత్రి అనుమానాస్పద కేసు నమోదు చేశారు. బుధవారం నాడు అంజలి కుటుంబ సభ్యులను విచారణ చేశారు. ఖననం చేసిన అంజలి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేయించారు. ఆమె ఆకలితోకాకుండా భర్త కొట్టడంతోనే చనిపోయిందని ప్రాథమికంగా నిర్ధారించి కేసు నమోదు చేశారు. ఇందులో భర్తతోపాటు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. దీనికి సబంధించిన వివరాలను అనంతపురం డీఎస్పీ రాఘవరెడ్డి బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం వివరాలను వెల్లడించారు. మృతురాలు అంజలి భర్త రాజు తాగుడుకు బానిసై కుటుంబ పోషణను పూర్తిగా పట్టించుకోవడం మానేశాడు. దీన్ని ఆసరాగా చేసుకుని బేల్దారి దస్తగిరి, బేల్దారి బాలులు మంచి జీవితాన్ని కల్పిస్తామని అంజలినిని నమ్మించి శారీరకంగా వాడుకుని మోసం చేసినట్టు డీఎస్పీ రాఘవరెడ్డి తెలిపారు. అదే క్రమంలో ఈనెల 23వ తేదీ ఉదయం బాలు, దస్తగిరిలు ఆటోలో అంజలిని తీసుకెళ్లి కొన్ని గంటల తరువాత మళ్లీ ఇంటికి తీసుకొచ్చారు. ఈ విషయంలో అంజలి భర్త రాజు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి అంజలితో గొడవపడ్డాడు. నిత్యం మద్యానికి బానిసై పనికెళ్లకుంటే కుటుంబ పోషణ ఎలాగని, అందుకే తాను బేల్దారి పనికెళ్లి వచ్చానని అంజలి చెప్పింది. అదే సమయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. అంజలిపై భర్త రాజు దాడి చేశాడు. తీవ్రకొట్టడంతో గాయాలపాలైన అంజలి మృతి చెందింది. మృతి చెందిన తీరును చూసి ఆమె అకలి బాధతో మరణించినట్లు ప్రచారం అయ్యింది. ఈ ఘటన ప్రచారం కావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో వెల్లడైన ప్రకారం భర్త రాజు, నమ్మించి మోసం చేసిన దస్తగిరి, బాలులపైనా కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం కేసును మరింత లోతుగా దర్యాప్తు చేయనున్నట్లు ఆయన తెలియజేశారు.

కటాలపల్లి టిడిపి నేత హత్యకేసు ఛేదింపు

వివాహేతర సంబంధమే హత్యకు కారణం
వివరాలను వెల్లడించిన ఎస్పీ మాధవరెడ్డి



హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ, తదితరులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో తీవ్ర సంచలనం రేపిన నల్లమాడ మండలం కటాలపల్లి గ్రామంలో జరిగిన టిడిపి గ్రామ నాయకుని హత్యకేసును పోలీసులు ఛేదించారు. ఈ హత్యలో ఎలాంటి రాజకీయ కోణం లేదని, వివాహేతర సంబంధం నేపథ్యమే కారణమని తేల్చారు. హత్య చేసిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి బుధవారం నాడు జిల్లా పోలీసు కాన్ఫిరెన్స్ హాల్లో విలేకరులకు వెల్లడించారు. కుటాలపల్లి గ్రామానికి చెందిన మృతుడు అమర్నాథ్ రెడ్డి(41)కి టిడిపి గ్రామ నాయకునిగా గుర్తింపు ఉంది. వ్యవసాయం చేసుకుంటూ ఈయన జీవనం సాగించేవాడు. ఈ నెల 24వ తేదీన పొలం వద్ద నిద్రించిన ఈయన్ను గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్లతో నరికి హత్య చేశారు. ఈ ఘటనపై వెంటనే పోలీసులు విచారణ చేపట్టారు. నిందితులను పట్టుకునే దిశగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా బుధవారం నాడు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారిని విచారించి హత్యకు గల కారణాలు తెలుసుకున్నారు.

వివాహేతర సంబంధ నేపథ్యమే హత్యకు కారణం

కుటాలపల్లికి చెందిన దుద్దుకుంట శ్రీనివాస్ రెడ్డి గత 15 సంవత్సరాలుగా కుటాలపల్లి తండాకు చెందిన రామావత్ తిప్పేబాయితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఆమె బాగోగులు అన్నీ అతనే చూసుకునేవాడు. గత మూడు నెలల నుంచి హత్యకు గురైన దుద్దుకుంట అమర్నాథ్ రెడ్డి తిప్పేబాయితో చనువుగా ఉండేవాడు. అప్పటి నుంచి తిప్పేబాయి శ్రీనివాసరెడ్డిని దూరం పెట్టింది. దీనిపై ఆగ్రహించిన శ్రీనివాసరెడ్డి తిప్పేబాయిని గట్టిగా ప్రశ్నించాడు. ఇందుకు ఆమె అమర్నాథ్‌రెడ్డి తన కుటుంబ అవసరాల నిమిత్తం లక్ష రూపాయలు సాయం చేశాడని, ప్రతినెలా తనకు కావాల్సిన అవసరాలు తీరుస్తున్నాడని తెలియజేసింది. ఇంతకాలం తానూ కూడా సాయం చేశాను కదా అంటూ శ్రీనివాసరెడ్డి ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాను ఉన్న పరిస్థితుల్లో లక్ష రూపాయలు అమర్నాథ్‌రెడ్డికి వెనక్కు ఇవ్వలేనని, నీవు ఇచ్చేస్తే మనిద్దరం కలిసి ఉండోచ్చని తిప్పేబాయి శ్రీనివాసరెడ్డికి తెలియజేసింది. శ్రీనివాసరెడ్డి ఆర్థిక పరిస్థితి బాగాలేనందు వల్ల డబ్బులు ఇవ్వలేనని చెప్పాడు. అయితే అమర్నాథ్‌రెడ్డిని అడ్డు తొలగించుకుంటేనే మనిద్దరం కలిసి ఉండొచ్చని తిప్పేబాయి శ్రీనివాసరెడ్డికి తెలిపింది. దీంతో శ్రీనివాసరెడ్డి అమర్నాథ్‌రెడ్డిని చంపేయాలని నిశ్చయించుకున్నాడు. ఇందులో భాగంగా తనకు సన్నిహితులైన కటాలపల్లి గ్రామానికి చెందిన గుండ్ర వీరారెడ్డి, చౌటకుంటపల్లి గ్రామానికి చెందిన వినోద్ కుమార్ అలియాస్ కర్ణా సహాయం తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో 24వ తేదీ రాత్రి ఒంటరిగా పొలం దగ్గర నిద్రిస్తున్న అమర్నాథ్ రెడ్డిని చంపాలని ముగ్గురూ నిర్ణయించుకున్నారు. అదే రోజు సాయంత్రం ముగ్గురూ నల్లమాడలో మద్యం సేవించి శ్రీనివాసరెడ్డి ద్విచక్రవాహనంలో అమర్నాథ్ రెడ్డి పొలం వద్దకి వెళ్లి అతని కోసం కాపుకాచారు. అమర్నాథ్‌రెడ్డి రాత్రి తోటలోకి రాగానే అప్పటికే తెచ్చుకున్న వేటకొడవలితో అతనిపై దాడి చేసి హత్య చేశారు. అనంతరం ద్విచక్రవాహనంలో ముగ్గురూ అక్కడి నుంచి పారిపోయారు. ఈ హత్యోదయం తీవ్ర సంచలనం రేపడంతో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. గ్రామస్తులు, అనుమానితులను విచారించగా పలు విషయాలు తెలిశాయి. ఈ నేపథ్యంలో నిందితులు కటాలపల్లికి చెందిన దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి, గుండ్ర వీరారెడ్డి, చౌటుకుంటపల్లికి చెందిన మల్లెల వినోద్‌కుమార్, కటాలపల్లి తండాకు చెందిన రామావత్ తిప్పేబాయిలను అదుపులోకి తీసుకున్నారు. అక్రమ సంబంధం నేపథ్యంలో ఈ హత్య చేసినట్లు నిందితులు పోలీసుల విచారణలో వెల్లడించారని ఎస్పీ మాధవరెడ్డి తెలియజేశారు.

సిబ్బందికి ఎస్పీ ప్రశంస

హత్య కేసును మూడు రోజుల వ్యవధిలో ఛేదించిన పోలీసులను ఎస్పీ మాధవరెడ్డి ప్రశంసించారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన పుట్టపర్తి డీఎస్పీ పి.వాసుదేవన్, సోషల్ మీడియా ఇన్స్‌పెక్టర్ హేమంత్ కుమార్, పుట్టపర్తి రూరల్ ఇన్స్‌పెక్టర్ రాగిరి రామయ్య, నల్లమాడ సిఐ రాజేంద్రనాథ్ యాదవ్, నల్లమాడ ఎస్ఐ జి.రమేష్ బాబు, ఎఎస్ఐ సూర్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుళ్లు నరసింహా, అశోక్, మనోహర్‌లను అభినందించారు.



రత్నాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పల్లె కుటుంబసభ్యులు

రత్నాకర్‌ను కలిసిన 'పల్లె' కుటుంబం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సత్య సాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ ను టిడిపి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి, ఆమె భర్త వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రత్నాకర్ స్వగృహంలో టిడిపి అభ్యర్థి తో పాటు మాజీ మంత్రి పల్లె, ఆయన కుమారుడు కృష్ణ కిషోర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రస్తుతం తాము చేపట్టిన ప్రచార కార్యక్రమాలు రాజకీయ పరిణామాలను రత్నాకర్ కు వివరించారు.

ఆధారాల్లేకుండా నగదు, వస్తువులు తరలించొద్దు

ప్రజాశక్తి - బత్తలపల్లి

సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యేంతవరకు ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఇతర ప్రాంతాలకు నగదు, వస్తువులు తరలింపు విషయంలో అనుమతి తప్పనిసరిగా ఉండాలని స్టాటిస్టికల్ సర్వేలెన్సు టీం సభ్యులు చాముండేశ్వరి, కానిస్టేబుల్ కృష్ణమోహన్ సూచించారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ఎస్ఎస్ టీమ్ సభ్యులు పలు అనుమానిత వాహనాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా టీం లీడర్ చాముండేశ్వరి మాట్లాడుతూ వ్యాపారస్తులు, వర్తకులు, రైతులు ఎవరైనా అవసరాలు నిమిత్తం తీసుకువెళ్లే నగదు ఇతరత్రా వస్తువులు తరలింపులో ఆధారాలు,అనుమతి పత్రాలు తమ వద్ద తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, నగదు విషయంలో పరిమితులు విధించారని చెప్పారు. వాహనాల్లో డబ్బులు,మద్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డబ్బు, మద్యం తీసుకువెళ్లేవారు రశీదు కలిగి అధికారుల నుంచి అనుమతి పొందాలని స్పష్టం చేశారు.

3న పింఛన్లు పంపిణీ

పుట్టపర్తి అర్బన్: ప్రతి నెల వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు ఇచ్చే పింఛన్ ఈసారి ఏప్రిల్ 3వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 31 కి ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న కారణంగా బ్యాంకులు పనిచేయవన్నారు. అలాగే ఒకటవ తేదీ రెండో తేదీ సెలవులు కారణంగా పింఛన్ల పంపిణీ జరగదన్నారు. దీంతో మూడవ తేదీ పింఛన్లను పంపిణీ చేస్తామని చెప్పారు. లబ్ధిదారులు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు : కలెక్టర్



విడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా పుట్టపర్తిలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ మంగళవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో రాష్ట్ర సచివాలయంలో సమావేశం నిర్వహించిన సందర్భంగా పార్టీల శాశ్వత కార్యాలయాలలో హోర్డింగ్‌లను తొలగించడంతోపాటు పలు సమస్యలను తమ దృష్టికి తెచ్చారన్నారు. ఎప్పటి నుంచో శాశ్వత ప్రాతిపదికన ఉన్న పార్టీ కార్యాలయాలు అనుమతి పొంది ఉన్న హోర్డింగ్‌లను తొలగించకుండా కొనసాగించాలని కోరారన్నారు. ఈ విషయమై భారత ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని అందుకు 48 గంటల ముందుగా సువిధ పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవలసి ఉందని అన్నారు. కొన్ని అత్యవసర పరిస్థితులలో 48 గంటల ముందు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేని పక్షంలో ఆన్ లైన్ ద్వారా కూడా అత్యవసర దరఖాస్తులను స్వీకరించి ఆ వివరాలు అన్నింటిని ఎన్కోర్ పోర్టల్ లో నమోదు చేసి సకాలంలో తగిన అనుమతులు జారీ చేయాలని సూచించారు. ముందుగా అనుమతి పొందిన ఇంటింటి ప్రచారానికి వెళ్లాలని నిబంధన అమలు అసాధ్యమని ఈ నిబంధనలను పున్ణ సమీక్షించాలని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారని చెప్పారు. ఈ నిబంధన అమలు విషయంలో పలు రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాన్ని పరిశీలించడంతోపాటు భారత ఎన్నికల సంఘం దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ అంశంపై త్వరలోనే సరైన నిర్ణయం తీసుకొని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్ఒకొండయ్య తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల మేరకు ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన వాణిజ్య స్థలాలతో పాటు కార్యాలయాలలో కూడా ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను, అనుమతించ వద్దన్నారు. ప్రస్తుతం జాతీయ రహదారుల పక్కన ఉన్న హోర్డింగ్‌లను అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాతిపదికన కేటాయించాలని నూతన హోర్డింగ్‌లకు అనుమతులు ఏ మాత్రం ఇవ్వద్దని అన్నారు. ప్రైవేట్ ప్రాంగణాలలో ముందస్తు అనుమతితో సులువుగా తరలించగలిగే ఒక జెండాను చిన్న బ్యానర్ ను ఏర్పాటు చేసుకునేందుకు రాజకీయ పార్టీలకు అనుమతించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారులు పుట్టపర్తి భాగ్యరేఖ, కదిరి వంశీకృష్ణ, ధర్మవరం వెంకట శివ సాయి రెడ్డి, మడకశిర గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు చూపుతున్న ఆయా మండలాల కన్వీనర్లు

కాంగ్రెస్ పార్టీ కన్వీనర్లకు నియామక పత్రాలు అందజేత


ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గం లోని ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్లకు బుధవారం నియామక పత్రాలను అందజేశారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిల నియామక పత్రాలను సత్యసాయి జిల్లా అధ్యక్షుడు సుధాకర్ కు అందజేయగా ఆ నియామక పత్రాలను నియోజకవర్గంలోని ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్లకు ఆయన శుక్రవారం అందజేశారు. మడకశిర మండల కన్వీనర్ గా మంజునాథ్, పట్టణ కన్వీనర్ గా బాబు, రొల్ల మండల కన్వీనర్ గా ఎస్ గౌడప్ప, అమరాపురం మండల కన్వీనర్‌గా గురుమూర్తి, గుడిబండ మండల కన్వీనర్‌గా నాగరాజు, ఆగలి మండల కన్వీనర్ గా లోకేష్‌ను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పిఎల్‌డి బ్యాంక్ ఛైర్మన్ పెద్దారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ సరిహద్దు ప్రాంతం కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా పిఎల్‌డి బ్యాంక్ ఛైర్మన్ గా మీనకుంటపల్లి పెద్దారెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు మడకశిర వైసిపి నాయకులు ఆయనను బుధవారం సన్మానించారు. పంచాయతీ వార్డు మెంబర్ గా పెద్దారెడ్డి రాజకీయ ప్రయాణం మొదలైంది.కామనదుర్గ పంచాయతీ ప్రెసిడెంట్, వరుసగా మూడుసార్లు సింగిల్ విండో అధ్యక్షులుగా,10 సంవత్సరాలు పాల ఉత్పత్తిదారుల సొసైటీ అధ్యక్షునిగా కొనసాగారు. ఆయన సేవలను గుర్తించి పావగడ తాలూకా పిఎల్‌డి బ్యాంక్ అధ్యక్షుడిగా ఎంపికచేశారు. రైతుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఈసందర్భంగా ఆయన తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు రామిరెడ్డి, ఎంపీపీ కవిత సత్యనారాయణ రెడ్డి, జడ్పిటిసి సరోజమ్మ మూర్తి, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు గౌడ్,మున్సిపల్ ఛైర్ పర్సన్ తనయుడు జయరాజ్, కౌన్సిలర్ నాగేంద్ర, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు

పదోతరగతి విద్యార్థిని ఆత్మహత్య

బత్తలపల్లి : 'అమ్మా నేను పదవ తరగతి పరీక్షలు బాగా రాశాను. ఉత్తీర్ణత అవుతాను' అంటూ సంతోషంగా తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసిన విద్యార్థిని సాయంత్రం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని విగతజీవిగా కనిపించడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ సంఘటన మండల కేంద్రమైన బత్తలపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామానికి చెందిన తిరుపాలు, ప్రమీలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వీరు గత కొంతకాలంగా బత్తలపల్లిలోని వడ్డెర కాలనీలో నివాసముంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. భార్యభర్తలు ఇరువురూ ఆర్డీటీ ఆసుపత్రిలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పెద్ద కుమారుడు బీఫార్మసీ, రెండవ కుమారుడు 8వ తరగతి, సుజన(15) పదవ తరగతి చదువుతున్నారు. బుధవారం పదవ తరగతి పరీక్షలు ముగిసాయి. ఈ సందర్భంగా ఇంటికి వచ్చిన సుజన తల్లిదండ్రులతో తాను పరీక్షలు బాగా రాశానని, పాస్ అవుతానని సంతోషం వ్యక్తం చేసింది. అందరూ కలిసి ఇంట్లో భోజనం చేసుకుని తిరిగి పనులకు వెళ్లిపోయారు. ఇంట్లో ఉన్న సుజన ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సోదరులు వచ్చి తలుపులు తెరవడానికి ప్రయత్నించగా తలుపులు రాకపోవడంతో అనుమానం వచ్చి స్థానికుల సహకారంతో తలుపులు తొలగించి లోపలికి ప్రవేశించారు. ఫ్యానుకు ఉరి వేసుకొని విగతజీవిగా సుజన కనిపించడంతో బోరున విలపించారు. సుజన రెండు నెలల నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నట్లు మృతురాలి కుటుంబసభ్యులు తెలిపారు. కడుపులో గడ్డ ఉండడం వల్ల ఈ సమస్య నెలకొందని . దీంతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటుందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య

తలుపుల : మండలం ఉడమలకుర్తి పంచాయతీ సోమలవాండ్లపల్లిలో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామానికి చెందిన వెంకట కొండయ్య నాయుడు, పలాస పాపయ్య మద్యం సేవించి అనంతరం ఘర్షణ పడ్డారు. ఈ నేపథ్యంలో వెంకటకొండయ్యనాయుడు బండరాయితో పలాస పాపయ్య ముఖంమీద బలంగా మోదడంతో పలాస పాపయ్య మృతిచెందాడు. వెంకట కొండయ్య నాయుడు కుమార్తెను పలాస పాపయ్య అసభ్య పదజాలంతో దూషించడాన్న కోపంతో వెంకట కొండయ్యనాయుడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని రూరల్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ దిలీప్ కుమార్ పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి కదిరి టౌన్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కదిరి రూరల్ మండలం ఒరిగిరెడ్డి పల్లి కి చెందిన బడా నాగిరెడ్డి కదిరి పట్టణం హిందూపురం రోడ్డులో నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో తాగునీరు తెచ్చుకునేందుకుకోనేరు సమీపన గల పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్లాడు. క్యానులో నీరు పట్టుకుని తిరిగి వెళుతున్న సమయంలో వెనక వైపు నుండి వస్తున్న వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన నాగిరెడ్డిని స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సూచన మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బడా నాగిరెడ్డి (ఫైల్‌ఫొటో)

మహిళా పక్షపాతి వైసిపి

కదిరి టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అనివైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్బుల్ సతీమణి దిల్షాద్ పర్వీన్ అన్నారు. బుధవారం కదిరి పట్టణం 25వ వార్డులో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ పరికి నజీమున్నీసా, వైస్ ఛైర్ పర్సన్ కొమ్ము గంగాదేవి, కౌన్సిలర్ నూహిరా షాహిన్ తదితరులు పాల్గొన్నారు.



వైసిపి ఎన్నికల ప్రచారం

బాధిత కుటుంబానికి పరామర్శ

గోరంట్ల రూరల్ : సహకార సంఘం మాజీ డైరెక్టర్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అజ్మతుల్లా తండ్రి ఆరోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న హిందూపురం పార్లమెంట్ టిడిపి అభ్యర్థి బీకే పార్థసారథి బుధవారం సాయంత్రం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవా నరసింహప్ప, అశ్వర్థరెడ్డి, బెల్లాల్ చెరువు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.